క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఈఓ గోపాలరావు



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా బదిలీపై వచ్చిన గోపాలరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక కాకర్లవీధిలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ గోపాలరావుకు బాధ్యతలు అప్పగించారు. గోపాలరావు భీమేశ్వరాలయం, వేణుగోపాలస్వామి దేవస్థానం, చిన్న శివాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ప్రభుత్వ ఆధీనంలోని ధర్మకర్తల సత్రాలకు కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తారు.

పెద్దింట్లమ్మ దేవస్థానం ఈఓగా శ్రీనివాసరావు



కైకలూరు: ఏలూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఈఓగా కూచిపూడి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు అర్చకులు పేటేటి వెంకట నాగేశ్వరరావు, ఐలూరు వెంకట్రామయ్యలు వేద ఆశీర్వాదం అందించారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక శ్రీరామ్‌పురం పుల్లపాడు వంతెన వద్ద ఉన్న శ్రీ బాల గణపతి స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై వీఏఏలకు శిక్షణ

మండవల్లి: మండవల్లి సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు 2024 సీజన్‌కు పంటకోత ప్రయోగాలపై సహాయ వ్యవసాయ సంచాలకుల సమక్షంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.గాంధీ శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటకోత ప్రయోగాల్లో సర్వే నంబర్లను రాండమ్‌గా సెలెక్ట్ చేయడం, ఫీల్డ్ లే అవుట్లు ఏవిధంగా తీసుకోవాలి తదితర విషయాలపై వీఏఏలకు తగు సూచనలు చేశారు. ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ రైతులందరికీ ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వీఏఏలకు సూచించారు. ముదినేపల్లి మండల ఏఎస్‌ఓ ప్రతిమ, మండల వ్యవసాయాధికార్లు బి.వేణుమాధవ్, ఎస్‌కే జరీనా పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన



పామర్రు: స్వచ్ఛతా హి సేవపై ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని కళాజాత కళాకారులు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కళాజాత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత నిర్వాహకులు యడవలి వీరయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త డబ్బాలను ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెత్తను వాటిలో వేసి పంచాయతీ వారికి అందజేయాలన్నారు. ప్లాస్టిక్ పదార్థాలను ప్రతిఒక్కరూ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామకృష్ణ, సర్పంచ్ కె.కస్తూరి, ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

సమస్యలను ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు

మండల సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలు



జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారిని సత్కరిస్తున్న ఎంపీపీ సుప్రజ, ప్రజాప్రతినిధులు

పమిడిముక్కల: కాలువల్లో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు ఇరిగేషన్ అధికారులను కోరారు. హనుమంతపురం చానల్ చివరి భూములకు నీరందక పొలాలు ఎండిపోతున్నాయని, డీఈ, ఏఈకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హనుమంతపురం నుంచి వచ్చే రోగులను వీరంకిలాకు పీహెచ్‌సీ సిబ్బంది చూడటం లేదని, పీహెచ్‌సీలో ఇన్సులిన్ అందుబాటులో లేక షుగర్ పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్ తెలిపారు. చోరగుడిలో తాగునీటి సమస్య ఉందని, రెండు ఐఎస్‌కే పంపులు మంజూరు చేయాలని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి కోరారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి నవంబర్ 30 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఉపాధి పనులు గుర్తిస్తామని టీఏ సుబ్బారావు తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్‌పామ్, మునగ సాగు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.3.50 కోట్లు ఉపాధి పథక నిధులు మంజూరైనట్లు ఏఈ శరాబందిరాజు తెలిపారు. భారీ వర్షాలతో పంట నష్టపోయిన 535 మంది రైతులకు సంబంధించిన 937 ఎకరాలకు పంట నష్టం మంజూరైందని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా ఈ–పంట, ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల్లో యూరియా, పొటాష్ అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలం తీసుకుని, ఇంటి నిర్మాణానికి రుణం మంజూరైన లబ్ధిదారులు మార్చి లోపు ఇళ్లు నిర్మించుకోవాలని ఏఈ భవానీ ప్రసాద్ తెలిపారు. మార్చి తర్వాత ఇళ్లు రద్దవుతాయని పేర్కొన్నారు. మళ్లీ ఎప్పటికీ వారికి రుణం మంజూరు కాదని తెలిపారు. శనివారం నుంచి మండలంలో మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమం చేపడుతున్నామని, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని సహకారం అందించాలని కోరారు. స్వచ్ఛతా హి కార్యక్రమాలను జయప్రదం చేయాలని, ఉపాధి పనులు పెద్ద సంఖ్యలో చేయించాలని ఎంపీడీఓ విఠల్‌పాల్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, కో–ఆప్షన్ సభ్యుడు దియానత్ అలీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పమిడిముక్కల: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. మండల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ పాలకవర్గం మూడేళ్లు నిండిన సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఎంపీటీసీ సభ్యులు మేరుగ లక్ష్మి, మేరుగ రాజేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, ఏఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేత



తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రేమ్‌బాబు

మండవల్లి: తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా సెక్రెటరీ దేవదాసు ప్రేమ్‌బాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బుడమేరు వరదల కారణంగా మండవల్లి మండలం మణుగునూరులో ఆస్తి నష్టం సంభవించిందని, జీవనోపాధి లేక, తాగునీరు లేక గ్రామస్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎస్సీ గ్రామమైన మణుగునూరు వాసులు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉండడంతో ఎంటువంటి సాయం నేటికీ అందలేదని తెలిపారు. ఈ గ్రామంలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, శ్మశాన వాటిక కూడా లేదని పేర్కొన్నారు. మణుగునూరు గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రేమ్‌బాబు కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



లింగవరంలో రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. రూరల్ మండలం లింగవరం గ్రామంలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే తాము విజయం సాధించినట్లు భావిస్తామన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరుతున్నానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వి.రమణ, తహసీల్దార్ వి.రామ కోటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దీపావళి నాటికి ఉచిత గ్యాస్ పథకం

స్థానిక శ్రీరామ్‌పురంలోని వెలమ సంక్షేమ సంఘం భవనంలో 100 రోజుల పాలన సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ దీపావళి నాటికి ఉచిత గ్యాస్ పథకం ప్రారంభిస్తామని తెలిపారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



కూచిపూడి-బార్లపూడి రహదారిలో నిలిచిన వర్షం నీరు

మొవ్వ: మొవ్వ మండలంలో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో పలుచోట్ల రోడ్లు, పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం సుమారు గంటన్నర వ్యవధిలో 32.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోనని కూచిపూడి, పెదపూడి, అయ్యంకి, మొవ్వ, యద్దనపూడి, కోసూరు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.

లింగవరం అభివృద్ధికి సహకరించండి

గుడివాడ టౌన్: రూరల్ మండలం లింగవరం అభివృద్ధికి సహకరించాలని గ్రామానికి చెందిన ఎ.రవికిరణ్ కోరారు. రోడ్డు శంకుస్థాపన పనుల్లో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎంపీడీఓ ఎ.వి. రమణకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. లింగవరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని, వీధి దీపాలు వెలగకపోవడంతో కుక్కల బెడద అధికంగా ఉందని తెలిపారు. తాగునీటి సరఫరా విధానం సరిగా లేదంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. గత నెల ఇవే అంశాలపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. స్థానిక కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ఆ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 14 మందికి సీఎంఆర్‌ఎఫ్‌గా రూ .11,56,946ను సాయంగా అందజేశామని తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు వల్లూరిపల్లి గణేష్,నూకారపు వీరాంజనేయులు, ప్రసాద్ పాల్గొన్నారు.

కొల్లేటి సరస్సును పర్యాటక కేంద్రంగా పునరుద్ధరించాలి

మండవల్లి: కొల్లేటి సరస్సును పర్యాటక కేంద్రంగా పునరుద్ధరిస్తే రాష్ట్రానికి ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలో మంత్రులు రవీంద్ర, పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కూటమి ప్రభుత్వ విజయోత్సవంలో కొల్లేరు సరస్సును పర్యాటకంగా అభివృద్ధి చేసి మరింత గుర్తింపు తెస్తామన్నారన్నారు. కొల్లేరును పర్యాటకంగా పునరుద్ధరిస్తే ప్రపంచంలోనే పెద్ద పర్యాటక కేంద్రంగా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు ఘన సన్మానం



బదిలీపై వెళుతున్న సబ్ రిజిస్ట్రార్ సత్యవతిని సన్మానిస్తున్న లేఖరుల సంఘ సభ్యులు

పామర్రు: పామర్రు సబ్‌రిజిస్ట్రార్ డి.సత్యవతి అవనిగడ్డకు బదిలీ కావడంతో స్థానిక కార్యాలయంలో ఆమెను శుక్రవారం దస్తావేజుల లేఖరుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యను సత్యవతి తెలుసుకుని తగువిధమైన పరిష్కారం చేసి పంపించేవారన్నారు. కార్యక్రమంలో లేఖరుల సంఘ కార్యదర్శి ఉదయ్‌కిరణ్, కోశాధికారి నందిపాటి వెంకటరామకృష్ణారెడ్డి, నాయకులు గోగినేని సుబ్బారావు, సీనియర్ రైటర్లు గోవర్ధన్‌రావు, నందిపాటి లక్ష్మీరెడ్డి, దుర్గారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయానికి వీల్ చైర్ బహూకరణ

నందిపాటి బాపిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటరామకృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం వీల్ చైర్‌ను బహూకరించారు.

సర్వేయర్ మణికుమార్ సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: సర్వేయర్ మణికుమార్ సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ నవీన్‌కుమార్ అన్నారు. మండల సర్వేయర్‌గా ఐదేళ్లు పనిచేసి బదిలీపై గుడివాడటౌన్‌కు వెళ్లిన బేతపూడి మణికుమార్ దంపతులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. ఐదేళ్లు సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. రీసర్వే డీటీ యేసుపాదం, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు మణికుమార్‌ను సత్కరించారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు మణికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం



స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ప్రారంభించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, సర్పంచ్ మెండ ఝాన్సీ, సురేష్, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ రామారావు, ఎం.సత్తిబాబు, హెచ్ఎం ప్రసాద్, పీడీలు, పీఈటీలు, మండల స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



కైకలూరు తాలూకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ నాయకులు

కైకలూరు: ఎస్సీల మనోభావాలను కించపర్చిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పల్లెవాడ ఎంపీటీసీ సభ్యుడు బంటుమిల్లి సాదు కొండయ్య, ఎస్సీ నాయకుడు ఈదా మురళీకృష్ణ డిమాండ్ చేశారు. కైకలూరు తాలూకా సెంటర్, రాచపట్నం సెంటర్లలో అంబేడ్కర్ విగ్రహాలకు శుక్రవారం ఎస్సీ క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఏలూరుపాడు నాగేంద్రస్వామి ఆలయం వద్ద ఫ్లెక్సీ అడ్డొస్తే రెవెన్యూ, పోలీసు వ్యవస్థల ద్వారా తొలగించాలన్నారు. అలాకాకుండా ఎస్సీల మనోభావాలను కించపర్చిన రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కోటి విజయరాజు, ఈదా లక్ష్మణుడు, చింతల జేమ్స్, యాకోబు, ముత్యాల విజయరాజు, యాళ్ల కృష్ణ, అడ్డంకి భగ్యరాజు, యేబేలు, కొరపాటి పరశురాముడు, సామేయేలు, జోగిరాజు, మాణిక్యాలరావు, మోహనరావు, భారతరత్న, క్రాంతి, బన్ను, రాజేష్, బాబీ, చిన్ను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీలో మండల స్థాయి పోటీలు

మండవల్లి: మండవల్లి ఎంఆర్‌సీ భవనంలో వ్యాసరచన, డిబేటింగ్, వక్తృత్వ పోటీలు మండల స్థాయిలో నిర్వహించినట్లు ఎంఈఓ రామారావు శుక్రవారం పేర్కొన్నారు. వక్తృత్వ పోటీలో ఎస్.కావ్య, వ్యాసరచనలో పి.గాయత్రి, డిబేటింగ్‌లో పి.వైష్ణవి, ఎల్.రుక్మిణీదేవి ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరు శనివారం జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రూరల్ సర్కిల్ సీఐగా రవికుమార్



కైకలూరు: రూరల్ సర్కిల్ సీఐగా వి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ బి.కృష్ణకుమార్ తణుకు రూరల్‌కు బదిలీపై వెళ్లారు. రవికుమార్ గతంలో ఇదే స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించారు. అనంతరం రాజమండ్రి, తాడేపల్లిగూడెంలో వివిధ హోదాల్లో పనిచేశారు.

పోటీ తత్వంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: పోటీ తత్వంతో విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్మోహనరావు పేర్కొన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణాంధ్ర 2024–47 కార్యక్రమంలో భాగంగా 6–10వ తరగతి విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలను ఎంఈఓలు అభినందించారు. న్యాయనిర్ణేతలుగా రాధా రుక్మిణి, అరుణ, రమేష్ రాజు వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: విద్యుత్ లైన్లు, విద్యుత్ సబ్ స్టేషన్లు మరమ్మతుల కోసం గుడివాడ పట్టణ పరిధిలో పెద ఎరుకపాడు, బేతవోలు, కార్మికనగర్, నిమ్మతోట, ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలనీలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్యం మెరుగునకు కృషి

పామర్రు: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ కేతావతు కస్తూరి అన్నారు. స్థానిక సచివాలయం–1 వద్ద శుక్రవారం స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాల్లో భాగంగా గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలు అక్టోబరు రెండో తేదీ వరకు ఉంటాయని తెలిపారు. ఎంపీడీఓ వై.రామకృష్ణ, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌సలీం తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ



మొవ్వ: మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా అంబటి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని ఆడిట్ విభాగంలో విధులు నిర్వహించిన సత్యనారాయణ బదిలీపై మొవ్వకు వచ్చారు, ఇప్పటి వరకు ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ఎల్.వెంకటేశ్వర్లు పెడన కార్యాలయానికి బదిలీ అయ్యారు.